# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని ఉద్ఘాటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ.**
2. **రియల్ టైమ్ గవర్నెన్స్ – ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
3. **ఆరోగ్యకరమైన జీవనానికి క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు.**
4. **జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా.**

===========================

మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన నారీ శక్తి వందన సమ్మేళనం కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశాభివృద్ధిలో భారతీయ మహిళలు గొప్ప సేవలందించారని ప్రధానమంత్రి పేర్కొన్నారు.. 21వ శతాబ్దం మహిళలదేనని నరేంద్రమోదీ తెలియజేస్తూ...

..వాయిస్.. 30 సెకకన్లు

---

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రియల్ టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీఎస్‌పై ఈరోజు సమీక్ష నిర్వహిస్తారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు, పనుల పర్యవేక్షణ, ఆర్టీజీఎస్ వ్యవస్థతో వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానించడం వంటి అంశాలపై చర్చించే అవకాశముందని అధికారులు తెలిపారు.

---

ఆరోగ్యకరమైన జీవనానికి క్రీడలు దోహదం చేస్తాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్

నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని స్థానిక క్రీడా మైదానంలో నిర్వహించిన "సిక్కోలు క్రియేటర్స్ క్రికెట్ లీగ్" బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్‌తో కలసి కేంద్రమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి అత్యంత కీలకమని అన్నారు. శ్రీకాకుళం వెనుకబడిన జిల్లా కాదని, అవకాశాల జిల్లా అని పేర్కొన్నారు. జిల్లా ఖ్యాతిని వివరిస్తూ నీటి సంరక్షణ, స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

మహిళలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేందుకు "నారీ శక్తి వందన్ అధినియం" ఉపయోగపడుతుందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ లంకా దినకర్ అన్నారు. ఈ మేరకు ఒక వీడియో సందేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలు, ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారికి రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

విశాఖపట్నంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం చందనోత్సవ మహోత్సవాలలో భాగంగా మొదటి దశ చందనం నూరే ప్రక్రియను ఈరోజు నుంచి ప్రారంభించామని ఆలయ కార్యనిర్వహణాధికారి జె.వెంకటరావు తెలిపారు. సింహాచలంలో ఆయన మాట్లాడుతూ, చందనం నూరే ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 20 వ తేదీన జరిగే చందనోత్సవం సందర్భంగా స్వామి వారి నిజరూప దర్శనం చేసుకోవాలనుకునే భక్తుల కోసం ఈరోజు నుంచి టికెట్ల విక్రయాలను ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 300, 1000 రూపాయల టికెట్ల విక్రయాలు జరుగుతాయని వెల్లడించారు.

---------------------------

ఆరోగ్యకరమైన జీవనానికి యోగాభ్యాసం దోహదపడుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శ అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడామైదానంలో నిర్వహించిన అమరావతి యోగా కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం లక్ష్మీ శ మాట్లాడుతూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు యోగా దోహదపడుతుందని ఏలూరు అదనపు ఎస్పీ జీ.ముని రాజా పేర్కొన్నారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ సిబ్బందికి నిర్వహించిన సామూహిక యోగాసనాల సాధన కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముని రాజా మాట్లాడుతూ, యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ఆందోళనలను తగ్గించి మానసిక ఏకాగ్రతను పెంచుతుందని తెలిపారు. నిత్యం విధి నిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, వారికి

యోగా ప్రాముఖ్యత తెలియజేసేలా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ – పీడీ చట్టం ప్రయోగించడంతో పాటు వారిని జిల్లా, నగర బహిష్కరణ చేస్తామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ఐపీఎల్ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌ల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల ఎస్పీలతో డీజీపీ శ్రవణ మాధ్యమం ద్వారా అమరావతి నుంచి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై పూర్తిగా నిషేధం ఉందని తెలిపారు. బెట్టింగ్‌లో పాల్గొనే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని, అక్రమ కార్యకలాపాలను నియంత్రించాలని ఆదేశించారు. జూద కార్యకలాపాల ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తామని, బ్యాంకు ఖాతాల్ని స్తంభింపజేస్తామని డీజీపీ స్పష్టం చేశారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో రేపటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక సేవల వారోత్సవాలను నిర్వహించనున్నామని జిల్లా అగ్నిమాపక అధికారి సింహాచలం ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేలా జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సాలూరు కేంద్రాల పరిధిలో వారం రోజుల పాటు పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు అగ్నిప్రమాదాల నివారణపై నినాదాలతో కూడిన ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రదర్శనలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలలో భద్రతా ప్రమాణాల తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీల స్థితిని ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ లేదా వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, జాప్యం లేకుండా వేగవంతంగా పరిష్కారించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

---------------------------

మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో 9552300009 నెంబర్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యుత్ బిల్లులు వంటి సేవలను కార్యాలయాలకు వెళ్లకుండా సులభంగా సెల్ ఫోన్ ద్వారానే పొందవచ్చని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలోని కుటుంబాలకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం సింగరకొండ వద్ద నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు అందజేసి, నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, మినీ బైపాస్ నిర్మాణంతో ఇళ్ళు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశామని తెలిపారు.

=====================